

# కథా కౌముది

## జీవన మాధుర్యం

కోటమర్తి రాధా హిమబిందు

వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన "మొట్టమొదటి అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల కథల పోటీ" లో బహుమతి పొందిన కథ.

శ్రీనివాస్ ఇంటికి వెళ్ళి వచ్చినప్పటినుండి నా మనసు ఏంటో శూన్యంలా అయింది. ఏం ఆలోచిస్తున్నానో నాకే తెలియటం లేదు. ఎందుకు ఆలోచిస్తున్నానో అంతకంటే అర్థం కావటంలేదు.

"డాడీ" అంటూ వచ్చి నా ఇద్దరు పిల్లలు నా ప్రక్కన చేరారు.

"ఏంటి.. హెడ్డేకా?" అద్దంలో చూసుకుంటూ మేకప్ తుడుచుకుంటూ అడిగింది రాణి..

"ఊహూ.. అదేం లేదు"

"మరేంటి?" అంతకంటే గొంతు పెంచి అంటూ బెడ్ పై అటు తిరిగి పడుకున్నాను నేను..

"చిట్టూ.. చక్కగా మీ ఇద్దరూ మీ రూంలోకి వెళ్ళిపోండి" ఆర్డర్ వేసింది రాణి..

"హు..బ్యాడ్ డాడీ" అంటూ బెడ్ దిగారిద్దరూ..

"మమ్మీ.. వాళ్ళింట్లో బోర్ గా ఉంది కదూ! "

"చాలా చాలా.. ఏదో ఒకప్పుడు తెలిసిన వాళ్ళు. కాస్సేపు హ్యాపీగా గడపొచ్చని డాడీ మాట కోసం మిమ్మల్ని కూడా తీసికెళ్ళాను గాని వేస్ట్... ఈ మేకప్ ఈ డ్రెసెస్ అలాంటి వాళ్ళకు అనవసరం అయినా ఏంటండీ.. వాళ్ళేం మారలేదు.. అచ్చంగా అప్పటిలానే ఉన్నారు. "

నేనేం సమాధానం చెప్పలేదు.

శ్రీనివాస్‌కు మా బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయిందని తెలుసునని చాలా సంతోషించాను నేను. చిన్నప్పటి నుండి ఇంటరు దాకా కలిసి చదువుకున్నాం. తర్వాత తర్వాత కాస్త దూరం పెరిగినా జాబ్స్ దొరికి పెళ్ళిళ్ళయినప్పుడు మాత్రం ఒకళ్ళని ఒకళ్ళం పిలుచుకున్నాం పిల్లలు పుట్టినప్పుడు వేడుకలకి కలుసుకున్నాం. ఆ తర్వాత చాలానే గ్యాప్ వచ్చింది. మళ్ళీ ఇన్ని సంవత్సరాలకి ఇప్పుడూ కలుసుకోగలిగాం.

మా వెనుక వీధిలో ఇల్లు చూసి పెట్టాను.

"ట్రిబుల్ బెడ్ రూం వద్దులేరా డబుల్ బెడ్ రూం చాలు

అహా... వద్దు. డబుల్ బెడ్ రూం చాలు.. గదులు ఎంత తక్కువగా ఉంటే మనుషులం అంత దగ్గరగా ఉంటాం" అన్నాడు.

వాడి ఇష్టప్రకారం మరికాస్త దూరంలో ఇంకో ఇల్లుచూశాను. ఫ్యామిలీని తెస్తానని చెప్పి వెళ్ళాడు. నాలుగు రోజుల తర్వాత మమ్మల్ని భోజనానికి ఆహ్వానించాడు.

పిల్లల్ని పరిచయం చేశాడు. ఒకమ్మాయి.. అబ్బాయి.. మా అమ్మాయిల్ని పరిచయం చేశాను. వాళ్ళ పిల్లలు నైన్త్ సెవన్త్.. మా పిల్లలూ సేమ్.. అవే క్లాసెస్ రాణి, లలిత పూర్వపరిచయం తోటి మాట్లాడుకున్నారు.

భోజనం చాలా బాగుంది.

వచ్చినప్పటినుండి నా కళ్ళు పిల్లల్ని.. ఇంటిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. పిల్లలు నమ్రత విధేయతతో ముచ్చటగా ఉన్నారు. అవసరమైన పరికరాలు, వస్తువుల వరస మాత్రమే కనిపిస్తూ ఇల్లంతా నీట్‌గా సర్దబడింది.

"అవి కొనలేదా.. ఇవి కొనలేదా? " అంటూ ఇల్లంతా కలియ తిరుగుతూ గుచ్చి గుచ్చి చూసింది రాణి "ఓ రోజు షాపింగ్‌కు వెళదాం లెండి" అనికూడా అంది.

చిరునవ్వు నవ్వి ఊరుకుంది లలిత.

"ఎ.సి. పెట్టించుకోండి."

దానికి లలిత చిరునవ్వే సమాధానం.

"పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీషు అలవాటులేదా? మా పిల్లలు ఇంగ్లీషు మీదనుండి దిగరు" అదో జోక్‌లాగా పెద్దగా నవ్వింది రాణి.

"ఇవాళ రేపు అంతా ఇంగ్లీషుమయం కదండీ.. స్కూల్లో ఎలాగూ మాట్లాడక తప్పదు. ఇంటి దగ్గర తెలుగులోనే మాట్లాడాలని అనుకున్నాం... మరీ ఇంగ్లీషుకే అలవాటుపడిపోతే తెలుగున్నది మర్చిపోతారేమో" అని భయం మెల్లగా అంది లలిత.

"అంతేనా మాట్లాడటం రాదా. సరదాగా అన్నానండోయ్ అంజలీ అశోక్ ఇంగ్లీషులో అట మాట్లాడుకోండి అత్తయ్యగారు వింటారట."

"అత్తయ్యగారూ అనవసరంలేదు. ఆంటీ అనొచ్చు. "

"లేదులెండి. మా పిల్లలకు అలానే అలవాటు చేశాం."

"అమ్మ..నాన్నగారు మావయ్యగారు.. అత్తయ్యగారు" అంటూ పిల్లలు ఎంతో వినయంగా మాట్లాడుతుంటే నాకు నిజంగా ఎంతో సంతోషంగా అనిపించింది. శ్రీనివాస్ పిల్లలు, మా పిల్లల్లాగానే ఇంగ్లీషులో మాట్లాడుతుంటే రాణివైపు చూశాను నేను. ఎందుకోగాని ముఖం నిప్పుల కుంపటిలో పెట్టుకుని ఉంది.

ఎలాంటి భేషజాలకు పోకుండా.. నవ్వు ముఖంతో మాట్లాడుతున్న లలిత శ్రీనివాస్ నాకెంతగానో నచ్చారు.

●●●

శ్రీనివాస్ తన పిల్లల్ని మా పిల్లలు చదువుతున్న స్కూల్లోనే చేర్పించాడు. పిల్లల మధ్య స్నేహం కొద్ది కొద్దిగా పెరగసాగింది. ఓ శనివారం సాయంత్రం మా పిల్లలతో పాటుగా శ్రీనివాస్ పిల్లలు కూడా మా ఇంటికి వచ్చారు. వాళ్ళను ఎప్పుడు చూసినా నాలో ఏదో తెలియని ఆనందం.. ఏదో దగ్గరితనం..!

ఇంట్లో రాణి లెదు.. ఏదో పార్టీ ఉందని వెళ్ళింది.

మా పిల్లలు ఫ్రిజ్‌లో ఉన్న బిస్కెట్స్ వాళ్ళకు పెట్టి కూల్ డ్రింక్స్ ఇచ్చారు.

"ఎవ్విరీ సాటర్ డే ఈవినింగ్ మా ఫ్రెండ్‌తో గెట్ టు గెదర్ పార్టీ చేసుకుంటాం. ఒక్కోసాటర్ డే ఒక్కో ఇంట్లో ఈ రోజు పార్టీ జానీ ఇంట్లో... మీరు కూడారండి."

"అహా మేం రాలేం సాటర్ డే ఈవినింగ్ మేం అంతా మాట్లాడుకుంటాం"

" ఏంటి మాట్లాడుకుంటారా... అదేంటి? "

"అంటే వారం అంతా నాన్నగారు బిజీ స్టడీస్ లో మేం బిజీ. అమ్మ ఒక్కతే బోర్‌గా గడుపుతుంది కదా.. అందుకని సాటర్ డే ఈవినింగ్ నుంచి నైట్ దాకా చాలాసేపు మాట్లాడుకుంటాం.

ఎవ్విరి సండే అమ్మమ్మ తాతగారు నాన్నమ్మ తాతగారితో మాట్లాడతాం. అమ్మనాన్నగారు మమ్మల్నెటైనా తీసుకువెళతారు ఇంట్లో కూడా గేమ్స్ ఆడుకుంటాం"

"ఎప్పుడూ వాళ్ళతో ఉంటే మరి ఫ్రెండ్స్ ? "

"మధ్యాహ్నం నుండి వాళ్ళతో గడుపుతాం. ఇంకా మాకు కొత్తకదా! ప్రియ, దేవి మా ఇంటికొస్తున్నారు. మేమూ వాళ్ళింటికి వెళుతున్నాం.. సండే టూ టూ ఫోర్ అయితే మిమ్మల్ని కలవగలం"

"ప్చ్.. అప్పుడు మ్యూజిక్ క్లాసుకు ఎటెండ్ కావాలి మేం మాకూ మీకూ వీలైనప్పుడు ఇలాగే కలుసుకుందాం"

"ఓ.కే"

శ్రీనివాస్ పిల్లలు వెళ్ళిపోయిన తర్వాత చాలా సేపు ఆలోచనలో పడిపోయాను నేను.

●●●

ఎందుకోగాని రాణి ఈ మధ్య చాలా డల్‌గా ఉంటోంది. రెండు మూడు సార్లు అడిగి చూశాను. ఏం లేదంది ముక్తసరిగా పార్టీలు కాస్త తగ్గించింది. మేకప్‌ల మీద అంతగా దృష్టి పెట్టటం లేదు. కారణం ఏంటో అర్థంకాకుండా అయింది నాకు.

"ఏంరా అదోలా ఉన్నావు? " లంచ్ టైములో అడిగాడు శ్రీనివాస్.

"నీతో కాస్త మాట్లాడాలిరా"

"అదేంటిరా పర్మిషన్ కావాలి అన్నట్లు ముఖం పెడతావు. ఏంటో చెప్పు"

"ఊహు. ఇప్పుడు కాదు. సాటర్‌డే మధ్యాహ్నం ఇంటికి వెళ్ళేటప్పుడు ఓ గంట బాబా మందిరంలో గడిపి వెళదాం."

"అలాగే తప్పకుండా."

●●●

"నిన్ను చూస్తుంటే జెలసీగా ఉందిరా."

"ఆ జెలసీనా వద్దు తప్పు" నవ్వాడు శ్రీనివాస్.

"ఏదో సరదాగా అన్నాను లేరా... నువ్వు వచ్చిన తర్వాత నాలో ఏంటో ఆలోచనలు మొదలయ్యాయిరా.. నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను. ఏంటోరా అనీజీనెస్ నన్ను ఇబ్బంది పెడుతుంది. ఈ మధ్య రాణీ కూడా అదోలా ఉంటుంది. "

శ్రీనివాస్ చిరునవ్వుతో చూశాడు నన్ను.

నా చేతిని వాడి చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా బిగించి పట్టుకున్నాడు.

"మా పెళ్ళయిన కొత్తలో మా ఇంటి ఎదురుగా ఒక కుటుంబం ఉండేది. సేమ్ ఇప్పుడు మన పిల్లల వయసులోనే వాళ్ళ పిల్లలు ఉండేవాళ్ళు. వాళ్ళ డీసెన్సీ.. డిసిప్లెయిన్ మా కెంతగానో నచ్చేది. మనకంటూ పిల్లలు కలిగిన తర్వాత వాళ్ళలాగానే తీర్చిదిద్దుకోవాలి అనే ఓ కమిట్‌మెంట్‌చేసుకున్నాం మేం ఇద్దరం. సరే అమ్మానాన్నగారు మనల్ని పెంచిన తీరులో సారాన్ని ఆల్ రెడీ జీర్ణించుకునే ఉన్నాం.

నాకూ లలితకూ ఓ తపన ఓ ఆశ...

పిల్లలు వాళ్ళ పిల్లలకు కూడా మార్గదర్శకులుగా నిలవాలని ఇప్పుడు వీళ్ళు ఎలా ఉంటే వాళ్ళని మంచిమార్గంలో నడిపించగలరు? అంటే.. ముందు మనం ఎలా ఉండాలి ఇలా సాగుతుండేవి మా ఆలోచనలు. మనం మనకు నచ్చిన తీరులో ఉందాం. ఎవరికీ నచ్చాల్సిన అవసరం లేదు. అదీ కుటుంబానికి సమాజానికి హానికానప్పుడు ఏంటి ఏమంటావ్? "

"కరెక్ట్ ఎగ్జాక్ట్లీ"

"నేనూ లలిత అదే అనుకున్నాంరా. ఇప్పుడు మేం నలుగురం ఒకే బెడ్ మీద పడుకుంటాం అలా వాళ్ళకూ మాకూ ఎంతో ఇష్టం.. ఎవరి రూం వాళ్ళకు అన్న సంస్కృతి మా ఇంట్లో లేదు.. ఇంకా చిన్నపిల్లలు అంతదూరం అవసరమా? మా 'మా' అనే బేధం మనమే సృష్టిస్తూ ఎప్పటికో తలలు పట్టుకోవటం ఎందుకు? అది మనం నేర్పిందేగా? పాపం పిల్లలకేం తెలుసురా.. ఏ పాత్రలో నీటిని పోస్తే ఆ ఆకారమే మలచుకుంటుంది. పిల్లలూ అంతే అని నా భావం. మంచి చెడుల తేడా. సంస్కృతి సంప్రదాయాల అర్థం. తరిగిపోతున్న విలువలు. పెరిగిపోతున్న అనర్థాలు.. ఇలా ఎన్నో ఎన్నో తెలియచెప్పాలి. కొంత సమయం ఇలాంటి టీచింగ్ కోసం కేటాయించుకోవాలి. పిల్లల్ని సన్మార్గంలో నడిపించే టాపిక్స్ మాట్లాడుకోవాలి... బెడ్ రూం.. లివింగ్ రూంలాగా వాటినే క్లాస్ రూం లాగా కూడా మార్చుకోవాలి.

పిల్లలకు ఫ్రీడమ్ ఇవ్వాలి. ఫ్రీగా వదిలేయాలి. సేమ్.. అదే సమయంలో కంట్రోల్‌లో కూడా ఉంచగలగాలి.. డబ్బు సంపాదిస్తున్నాం.. బాగానే సంపాదిస్తున్నాం మంచిదే. మేం అయితే ఇంతకంటే గొప్పగా, క్లాస్‌గా బ్రతకొచ్చు.. కానీ ఆస్థాయికి వెళ్ళటం నిజంగా మాకిష్టం లేదు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టే విధానం పిల్లలపై ఎంతో ప్రభావం చూపిస్తుంది! నా ఉద్దేశ్యంలో వాళ్ళ ఇంట్లో ఏ.సి. ఉంది, వాళ్ళ పిల్లలు అంత ధర గల డ్రెస్ వేసుకున్నారు.. మనం ఇలా ఎందుకుండాలి? అన్న ప్రశ్న పిల్లలు వేయకూడదు. అలా వాళ్ళు ఉండాలంటే కష్టం అంటే ఏంటో ఎలా ఉంటుందో వాళ్ళకు తెలియజేయాలి.

పిల్లల్ని సుఖమార్గాలవైపు నడిపిస్తూ హీనంగా బ్రతకాల్సిన అవసరం కూడా లేదు అంటూ విర్రవీగుతూ సంపాదించేది ఎవరి కోసం అంటే నేను ఒక్కటే చెప్పగలను. సేవింగ్ అంటే ఏంటో నేర్పాలి. మనం సేవ్ చేయాలి. ఎమౌంట్ సేవింగ్ చేస్తే పిసినితనం ఎలా అవుతుంది?

కల్చర్ అనేది ఆడంబరంలో లేదు.. కల్చర్స్ అనేది మన సంస్కృతిలో ఉండాలి. పిల్లల భావాలు ఆలోచనలలో ఆధునికత ఉండాలి... కానీ వాటి వెనుక నీడలా మనమూ ఉండాలి. మన ప్రోత్సాహం ఉండాలి. ఎంతవరకు కరెక్టో వాళ్ళకు అర్థం చేయించాలి. ఏ.సి. రూముల్లో క్రోటన్ మొక్కల్లా పిల్లల పెంపకం ఉండకూడదు.

పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత మనం ఏం మార్చగలం? ఏదైనా మనల్ని చూసే వాళ్ళు నేర్చుకునేది. అహంకారం ఓర్వలేని తనం నిర్లక్ష్యంణం ధోరణి... హేళన చేయటం.. ఇలాంటివి పిల్లలకు కావాలని కూర్చోబెట్టి నేర్పుతున్నారని కాదు.. కానీ వాళ్ళు మనల్ని గమనించి నేర్చుకుంటారన్నదే నేను చెప్పుకొచ్చేది. "

శ్రీనివాస్ ఎవర్ని దృష్టిలో పెట్టుకుని అంటున్నాడో నాకు అర్థం అయింది.

"ఏ విషయంలోనైనా పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకుంటూ పోవాలి. మనసులు ప్రశాంతంగా చేసుకుంటూ హాయిగా బ్రతికేయగలిగాలి.. ఈ బిజీ వాతావరణంలో సరదా సంతోషాలు మనమే సృష్టించుకోవాలి. మంచి మనసుతో ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోగలగాలి.

కుటుంబ వాతావరణం నందనవనంలాగా మార్చుకోగలగాలి. తల్లి తండ్రి పిల్లలు ఒక్క మాటమీద నిలబడగలగాలి. నీ దారి అటు నాదారి ఇటు అన్నట్టుగా ఉంటే అది కుటుంబం ఎలా అవుతుంది? భార్యా, భర్త, పిల్లలు అని అనుకోవటంలో అర్థం ఏముంది? సమాజం మాకేదో చేయాలని కోరుకోవటంలేదు... మీ కుటుంబాలని మీరు తీర్చిదిద్దుకుంటే చాలు అంటూ అర్థిస్తోంది. ఆ మాత్రం మంచి ప్రయత్నాలు చేసి మంచి సమాజాన్ని సృష్టించలేమా మంచి కుటుంబాల సమూహంతో ధీటుగా నిలబడలేమా?

ఏదైనా చేయాల్సింది మనమే. అంతా తల్లిదండ్రులచేతుల్లోనే ఉంది. పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది ఖచ్చితంగా నాణానికి ఒకవైపే చూసుకుంటూ మురిసిపోవటం కాదు.. రెండో వైపు కూడా చూడాలి. ఒక్కోసారి నాకనిపిస్తుంది.. ఈ జీవితం ఓ పదిహేను సంవత్సరాలు వెనక్కు వెళితే బాగు. కనీసం ఓ పది సంవత్సరాలైనా సరే.. కానీ అది ఊహకేగాని నిజానికి జరిగేదికాదు

ఎందుకలా?

కొన్ని చిన్న చిన్న తప్పులు కొన్ని లోపాలు చేశాను.. అలా చేయకుంటే జీవిత మాధుర్యం ఇంకా బాగుండేది. లలిత అంటుంది ఇంకా చాలా జీవితం ఉంది ఆ లోపాలు ఆ తప్పులు ఇప్పుడు చేయనంటే సరిపోతుంది కదా అని.. ఓ.కే.. అలా కూడా బెటరే అనుకో. "

శ్రీనివాస్ మాటలు నాలో కొత్త ఉత్సాహాన్ని కొత్త ఉత్తేజాన్ని నింపటమే కాకుండా నాకు తెలియని సరికొత్త మార్గాన్ని సూచించినట్లయింది..

"ఏమండీ.. నిద్రపోతున్నారా?"

"లేదు రాణి.. చెప్పు"

"నేను ఈ మధ్య నాలుగైదు సార్లు లలితగారింటికివెళ్ళాను. మీతో చెప్పలేదు. "

నేను ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాను.

"ఏంటి? ఎందుకు? "

"ప్చ్... వెళ్ళాలనిపించింది వెళ్ళాను. నిజంగా వాళ్ళిల్లు ఓ స్వర్గం అంతే.. కొన్ని పద్ధతులు అంటూ ఏర్పాటు చేసుకుని వాటికి కట్టుబడి ఉన్నారు.. కుటుంబ ప్రాధాన్యత చాలా ఎక్కువ. నాలాగా ఏ విషయాలని ప్రవర్తనలతో రోజులకు రోజులు నేను వేదన పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఏంటో గొప్పస్థాయిలో ఉండాలని స్టేటస్ సింబల్‌గా నిలిచిపోవాలని... అంచేత గుర్తించబడాలని ఎంత శ్రమించాను. ఎంతగా తిరిగాను అవన్ని దక్కినట్లే దక్కి దోసిటిలోని నీళ్ళలా కారిపోతుంటే నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాను. అసలు ముందు ఏది ముఖ్యం అన్నది ప్రశ్నార్థకంగా నిలిచింది.

లలితగారన్నారు.. మీ పిల్లలు మా పిల్లలకంటే బాగా చదువుతారు. మార్కులు ఎక్కువ వస్తాయని నిజంగా వాళ్ళ పిల్లలకి వచ్చినట్లే సంబరపడిపోయారు.. మార్కులంటే ఇంకాస్త కష్టపడితే వస్తాయి. కానీ... ప్చ్ చాలా బాధగా ఉందండీ.. మనం ఒక లెవెల్లో ఉండి పిల్లల్ని ఓ లెవల్లో పెంచాం. ఏ పనిచేస్తున్నా ఎటువెళ్ళినా నన్ను వెంటాడుతున్నాయి.. ఆవిడ నిజానికి ప్రత్యేకించి నన్నేమీ అనలేదు. కానీ ఆ అర్థం ఆ మర్యాద.. ఆ గౌరవం ఆ ప్రతిభ నన్ను నిలదీశాయి. పిల్లల్ని మరికాస్త మెరుగు పరచుకుంటే బాగని సూచించాయి. మంచి అన్నది ఎక్కడ గుర్తించినా దాన్ని మన సొంతం చేసుకోవటంలో తప్పేముంది?

ముఖ్యంగా నాలో ఇంకాస్త మార్పురావాలి. పిల్లల్ని కాస్తా మార్చుకోవాలి. నేను కొన్ని తప్పులు చేశాను. చాలా లోపాలే నాలో ఉన్నాయి. తెలుసుకున్నాను కాబట్టి తప్పులు ఇప్పుడు చేయనంటే సరిపోతుంది కదా ! "

"రాణీ"

నేను ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ మధన పడుతున్న సమయంలో రాణి ఇలా మాట్లాడటంతో నాకు కొండంత ధైర్యం వచ్చినట్లయింది.

"అమ్మా.. మేం వచ్చేశాం" గుమ్మంలో పిల్లలిద్దరూ నిలబడి నవ్వుతున్నారు. నాకేం అర్థంకాలేదు.. విచిత్రంగా చూశాను.

"ఇక నుండి అంజలి అశోక్ లాగా మనల్ని అమ్మానాన్నగారూ అని పిలుస్తారుట. అలా పిలవాలని వాళ్ళకు ఉందట. కొత్త అలవాటు కాస్త కొత్తగా అనిపిస్తుంది. నాలుగు రోజులు పోతే ఈ పిలుపుకే అలవాటు పడిపోతాం. ఏదైనా మనం అనుకోవాలేగాని సాధించటం ఏం కష్టం.. ఈ రోజు నుంచి పిల్లలు మన దగ్గరే పడుకుంటారు" చిరునవ్వుతో అంది రాణి .

భవిష్యత్తులోని జీవన మాధుర్యం అప్పుడే నా కళ్ళముందు నిలిచినట్లయింది.

●●●

Click here to share your comments on this story